

ఆధునికీకరణపై అనుమానమే..!


సుంకి సమీపంలో కుడి కాలువ దుస్థితి

- తోటపల్లి పాత బ్యారేజీ పరిధిలో 30 శాతం లోపే నిర్మాణాలు
- బిల్లులు చెల్లింపులు కాని వైనం
- నిలిచిపోయిన పనులు
- స్పందించని సర్కారు
- రబీ పంటలకు సాగునీరు అందించని అధికారులు
- ఆందోళనలో రైతులు

(గరుగుబిల్లి)

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని పాత బ్యారేజీ కుడి, ఎడమ, ప్రధాన కాలువల ఆధునికీకరణపై సందిగ్ధం నెలకొంది. గత నాలుగేళ్లుగా సర్కారు కాలయాపన చేస్తోంది తప్ప పూర్తిస్థాయిలో పనులు నిర్వహించేందుకు అడుగులు వేయడం లేదు. వాస్తవంగా రెండు కాలువల పరిధిలో కొంతమేర చేపట్టిన పనులకు సుమారు రూ. 30 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. వైసీపీ సర్కారు సకాలంలో బిల్లుల చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ఆ పనులకు బ్రేక్ పడింది. మరోవైపు ఆధునికీకరణ నెపంతో ప్రాజెక్టుల నుంచి రబీ పంటలకు సాగునీరు ఇవ్వడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 'పనులైనా చేపట్టండి.. సాగునీరైనా ఇవ్వండి' అంటూ డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

వాస్తవంగా రెండు కాలువల అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వం రూ.195 కోట్లు మంజూరు చేసింది. అప్పట్లో సాయిలక్ష్మి ఏజెన్సీ, పీఎస్ఆర్ కంపెనీలు కొంతమేర పనులు నిర్వహించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. నిధులు విడుదల కోసం కొర్రీలు పెట్టారు. దీంతో మూడేళ్ల పాటు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మొత్తంగా వైసీపీ ప్రభుత్వ నిర్వాహకంతో పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు విజయనగరం జిల్లా పరిధిలోని పలు మండలాల రైతులకు సాగునీరు కష్టాలు తప్పడం లేదు. వందేళ్లకు పైగా నిర్మించిన కాలువల నుంచి అధికారికంగా 65 వేల ఎకరాలకు, అనధికారికంగా సుమారు 30 వేల ఎకరాలకు పైగా సాగునీరు సరఫరా కావాల్సి ఉంది. అయితే ఈ ప్రభుత్వ హయంలో సాగునీరు సరఫరాతో పాటు కాలువలు అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. పాత బ్యారేజీకి సంబంధించి ఒకవైపు నిధులు, మరోవైపు సిబ్బంది సమస్య కూడా ఏర్పడింది. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో సాగు, తాగునీటికి రైతులు ఇబ్బందులు పడేవారు కాదు. నిబంధనల మేరకు రైతులతో సమావేశాలు నిర్వహించి వారాబందీ మేరకు సాగునీరు కోసం ప్రణాళికలు రూపొందించేవారు. ఖరీఫ్, రబీలకు సాగునీరు పుష్కలంగా అందేది. ప్రస్తుతం ఖరీఫ్‌కే రైతులు సాగునీరు కష్టాలు ఎదుర్కొంటు న్నారు. గత ఖరీఫ్ సమయంలో రెండు కాలువల పరిధిలో అధికంగా గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చేందుకు నిధులు లేకపోవడంతో అధికారులు, రైతులు చందాలు వేసుకొని ఆ పనులు చేపట్టాల్సి వచ్చింది.


తురకనాయుడువలసలో ఎడమ ప్రధాన కాలువ ఇలా..

30 శాతమే..

గత నాలుగున్నరేళ్లుగా పాత బ్యారేజీకి సంబంధించి 30 శాతం పనులనే నిర్వహించారు. ఆధునికీకరణకు రూ. 40 కోట్లు వెచ్చించారు. ఖరీఫ్ సాగునీరు నిలుపుదల తర్వాత గతేడాది డిసెంబరులో పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే చెల్లింపులు కాకపో వడంతో పనులు దక్కించుకున్న కంపెనీలు సబ్ కాంట్రాక్టర్లకు ఆ బాధ్యతను అప్పగించాయి. అయినా సరే నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. బకాయిలు చెల్లిస్తేనే పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్లు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం పనులు నిర్వహించినా.. మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం దృష్ట్యా బిల్లుల చెల్లింపులు జరుగుతాయో లేదోనన్న దిగాలులో వారున్నారు. మొత్తంగా ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి 37.62 కిలో మీటర్లకు గాను 16 కిలో మీటర్లు, కుడి కాలువ పరిధిలో 17.616 కిలో మీటర్లకు గాను 9.37 కిలో మీటర్ల మేర లైనింగ్ పనులు జరిగాయి. రెండు కాలువల పరిధిలో 19 బ్రాంచి కాలువల పనులు జరగాల్సి ఉంది. మరో 267 వరకు ఆక్విడెక్టులు, సూపర్‌పాసేజ్‌లు, అండర్ టన్నెళ్లు, ఔట్‌లెట్లు, డ్రాపులు, స్లూయిస్‌లు నిర్మించాల్సి ఉంది.

సాగునీరు విడుదలలో జాప్యం

ఏటా ఖరీఫ్ తర్వాత రబీ సమయంలోనే ఆధునికీకరణ పనుల నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. అయితే నిధుల సమస్యతో నత్తనడకనే ఆ పనులు సాగుతున్నాయి. ఏటా డిసెంబరులో పనులు ప్రారంభించి మే, జూన్ వరకు చేపట్టేవారు. ఆ తర్వాత ఖరీఫ్‌కు సాగునీరందించేవారు. అయితే ఏటా రబీకి తాగు, సాగునీరు సరఫరా చేయడం లేదు. ఆధునికీకరణ పేరిట ఏటా నవంబరు నెలాఖరులో సాగునీరు నిలుపుదల చేస్తున్నారు. ప్రస్తుతం పనులు నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. అయితే సంబంధిత కాంట్రాక్టర్లకు మూడు పర్యాయాలు గడువు పెంచా రు. తాజాగా 2024, మే నాటికి పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్లు పనులు నిర్వహిస్తారో, లేదో అన్నది వేచి చూడాల్సి ఉంది. ప్రస్తుతం ఆధునికీకరణ పనులు పూర్తికాకుంటే రానున్న ఖరీఫ్‌కు అధికంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయి. నిధుల సమస్యతో అధికారులు నోరు మెదపడం లేదు.

సమాచారం ఇస్తాం..

తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని రెండు కాలువల అభివృద్ధి పనులు చేపట్టనున్నారని తెలిసి ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా నిలుపుదల చేశాం. బిల్లుల చెల్లింపుల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులు మొదలుకాకుంటే ఉన్నతాధికారులతో చర్చించి తాగునీటి అవసరాల నిమిత్తం సరఫరా చేస్తాం. కొన్నాళ్లుగా రబీకి సాగునీరందించడం లేదు. ఆధునికీకరణ పనులకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం. రైతులు సమాచారం లేకుండా ఆరుతడి పంటలకు సిద్ధపడకూడదు. నీటి విడుదలకు సమాచారం ఇస్తాం.


- దమలపాటి రవికుమార్, డీఈఈ, పాలకొండ డివిజన్


బొబ్బిలిలో సిద్ధమవుతున్న సభా వేదిక

బొబ్బిలి గర్జనకు రా.. కదిలిరా!

- నేడు విజయనగరం జిల్లాకు టీడీపీ అధినేత చంద్రబాబు
- శ్రేణులు, అభిమానులు భారీగా హాజరయ్యే అవకాశం
- సభకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన పార్టీ నాయకులు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు వాగ్బాణాలు సంధించనున్నారు. బుధవారం బొబ్బిలి వేదికగా గర్జించనున్నారు. తెలుగు తమ్ముళ్లు, అభిమానులు కదిలి వచ్చేందుకు కంకణబద్ధులయ్యారు. కొద్ది గంటల్లో బొబ్బిలిలో రా కదలిరా సభ ప్రారంభం కానుంది. ఈ వేదికకు బొబ్బిలి గర్జనగా నామకరణం చేశారు. సభకు భారీగా పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉంది. అందుకు తగినట్లు టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా రా.. కదలిరా సదస్సుల్లో వైసీపీ ప్రభుత్వ విధానాలు, స్థానిక వైసీపీ నేతలు చేస్తున్న దందాలను చంద్రబాబు ఎండగడుతున్న నేపథ్యంలో బొబ్బిలిలో జరిగే పర్యటనపైనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చ సాగుతోంది.

ఏర్పాట్లు పూర్తి

బొబ్బిలి: బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో బుధవారం జరగనున్న టీడీపీ బొబ్బిలి గర్జన సభకోసం ఆ పార్టీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రా కదలిరా నినాదంతో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బొబ్బిలి బహిరంగ సభలో ప్రసంగించనున్న సంగతి తెలిసిందే. విజయవాడ విమానాశ్రయంలో ఆయన బుధవారం ఉదయం 10.15 గంటలకు బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు 11 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11.50 గంటలకు బొబ్బిలి రాజా కళాశాల మైదానానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంటన్నర వరకు బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొంటారు. మధ్యాహ్నం 2.45 గంటలకు తిరుగు ప్రయాణమై కాకినాడ జిల్లా తుని మండలం చామవరం బహిరంగసభకు హాజరవుతారు. ● బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభాస్థలి, హెలీప్యాడ్‌ను మంగళవారం విజయనగరం జిల్లా ఏఎస్పీ ఆస్మా ఫర్హీన్, బొబ్బిలి డీస్పీ శ్రీధర్, సీఐలు ఎం.నాగేశ్వరరావు, తిరుమలరావు పరిశీలించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయనతో ఏఎస్పీ చర్చించారు. జన సమీ కరణ, వాహనాల పార్కింగ్ తదితర అన్ని అంశాలపై ఆమె ఆరా తీశారు. సభాస్థలిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. హెలిపాడ్ కోసం మైదానాన్ని చదును చేశారు. బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు కూడా నిర్వహించారు.

దాహం తీర్చండయ్యా!

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు ● టీడీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో


కొత్తవలస వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు, టీడీపీ శ్రేణులు

పార్వతీపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కొత్తవలస వాసులు బిందెడు నీటి కోసం రోడ్డెక్కారు. దాహార్తి తీర్చాలని నినదించారు. గత 12 రోజులుగా వారికి తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆ ప్రాంత మహిళలు మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో కొత్తవలస ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పెద్దఎత్తున తరలివచ్చిన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని విజయచంద్ర ప్రశ్నించారు. పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించలేని పాలకవర్గాలు, అధికారులపై ఆయన మండిపడ్డారు. అనంతరం సీఐ కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకొని టీడీపీ నేతలతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ నిరసనలో 8వ వార్డు కౌన్సిలర్ నారాయణరావు, టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, కోలా మధుసూదనరావు, బోను దేవి చంద్రమౌళి, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష

- జిల్లా నుంచి హాజరైన కలెక్టర్, ఎస్పీ



పార్వతీపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సన్నద్ధతపై విజయ వాడలో మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష సమావేశం నిర్వహించింది. దీనికి జిల్లా నుంచి కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గతేడాది అక్టోబర్ 27న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో గుర్తించిన డబుల్ ఎంట్రీలు, ఒకే డోర్ నెంబర్‌లో అత్యధిక ఓట్లు నమోదవడం, వాటిపై తీసుకున్న చర్యలు, కొత్తగా ఓటర్ల నమోదు తదితర వాటిపై చర్చించారు. సమ స్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ వివరించినట్లు తెలిసింది.

నిరసన హోరు

- జిల్లాలో అంగన్‌వాడీల ఆందోళనలు
- 29వ రోజుకు సమ్మె ● సర్కారు తీరుపై ఆగ్రహం
- హామీలు నెరవేర్చాలని డిమాండ్


కురుపాంలో సాష్టాంగ నమస్కారాలు చేస్తున్న దృశ్యం

బెలగాం/సాలూరు/గరుగుబిల్లి/గుమ్మలక్ష్మీపురం/సీతంపేట/ కురుపాం, జనవరి 9: సమస్యల పరిష్కారం, హామీల అమలు కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 29వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రం పార్వతీపురంలో వారు నిరవధిక దీక్షను కొనసాగించారు. పాలకొండ ప్రాజెక్టుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరై వారికి సంఘీభావం తెలిపారు. సీఎం జగన్ మొండి వైఖరి వీడాలని, కక్షపూరిత చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. తమ గోడు విని డిమాండ్లు నెరవేర్చాలని, ఎస్మా చట్టాన్ని రద్దుచేయాలని నినదించారు. రాత్రి నిరసన శిబిరం వద్దే చలిలో పడుకుని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం ఆగదని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. సాలూరులో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని శిబిరం వద్ద అంగన్‌వాడీలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన ప్రదర్శన చేపట్టారు. గరుగుబిల్లిలో కాగడాలతో నిరసన వ్యక్తం చేశారు. చిరుద్యోగులపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. సర్కారు తీరును ఖండిస్తున్నామన్నారు. సర్కారు దిగి రాకుండా సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వెల్లడించారు. ఇక గుమ్మలక్ష్మీపురంలో అంగన్‌వాడీలు ప్రధాన రహదారిపై పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరవధిక దీక్షలో భాగంగా రాత్రి సీతంపేట ఐటీడీఏ ఎదుట శిబిరం వద్ద అంగన్ వాడీలు పడుకుని నిరసన తెలిపారు. సర్కారు స్పందించకుంటే ఈ నెల 11 నుంచి ముఖ్యమంత్రి కార్యాలయం వద్ద దీక్ష చేపడతామని వారు చెప్పారు. కురుపాంలో శిబిరం వద్ద సాష్టాంగ నమస్కారాలు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు.


గుమ్మలక్ష్మీపురం: పొర్లు దండాలు పెడుతూ..


సీతంపేట: శిబిరంలో పడుకుని నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు


గరుగుబిల్లిలో..


పార్వతీపురంలో..


సాలూరులో..




పార్వతీపురం, సాలూరులో నిరసన తెలియజేస్తున్న పారిశుధ్య కార్మికులు

హామీల అమలులో నిర్లక్ష్యమెందుకు?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పారిశుధ్య కార్మికులు

పార్వతీపురం టౌన్, జనవరి 9 : హామీల అమలులో నిర్లక్ష్యమెందుకని పారిశుధ్య కార్మికులు వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగం కార్మికులతో కలిసి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీలతో పాటు తమ సమస్యలు పరిష్కరించడంలో మొండి వైఖరి తగదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. ● అనంతరం ప్రజా సంఘాల నాయకులు జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీలపై ఎస్మా ఎత్తివేయాలని, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ● **సాలూరు:** సాలూరులో మున్సిపల్ కార్మికులు నుదుటపై పంగనామాలు పెట్టుకుని నిరసన తెలిపారు.

సర్కారు స్పందించే వరకు పోరు

- తేల్చి చెప్పిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

బెలగాం/పార్వతీపురం రూరల్, జనవరి 9: తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ ఎస్ఏ) ఉద్యోగులు తేల్చి చెప్పారు. మంగళవారం పట్టణంలోని కలెక్టరేట్ శిబిరం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పాదయాత్ర సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినదించారు. సర్కారు తీరును ఖండిస్తూ.. బుధవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని జేఏసీ నాయకుడు దివాకర్ తెలిపారు. కాగా డీఈవో కార్యాలయం అధికారులు వారి శిబిరం వద్దకు చేరుకుని సమ్మె విర మించాలని కోరారు. అయితే ఇందుకు ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఒప్పుకోలేదు. సర్కారు స్పందించేవరకు పోరాటం కొనసాగి స్తామని స్పష్టం చేశారు. అనంతరం వారు ఎమ్మెల్యే జోగారావు ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.


సమ్మె విరమించాలని కోరుతున్న అధికారులు

'బొబ్బిలి గర్జన' తాడేపల్లికి వినపడాలి

● చంద్రబాబు 'రా.. కదిలిరా..'. సభను విజయవంతం చేయండి
● పార్టీ శ్రేణులను కోరిన టీడీపీ నాయకులు


రామభద్రపురం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న బేబీనాయన


గజపతినగరం: మాట్లాడుతున్న కళా వెంకటరావు


రాజాం: మాట్లాడుతున్న కోండ్రు

రామభద్రపురం, జనవరి 9: బొబ్బిలిలో బుధవారం జరిగే చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలి రావాలని, ఈ గర్జన తాడేపల్లికి వినబడేలా విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన పిలుపునిచ్చారు. ముచ్చర్లవలసలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు టీడీపీతో పాటు జనసేన కార్యకర్తలు, నాయకులను తీసుకురావాలన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినా యుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు, జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ కనిమెరక శంకరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షుడు ముల్లు రాంబాబు, ఎంపీటీసీలు భవిరెడ్డి చంద్ర, భవిరెడ్డి శంకరరావు, సర్పంచ్‌లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా... పాతరేగకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు బేబీనాయన సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి స్వాగతం పలికారు.

శృంగవరపుకోట: జిల్లా పరిధిలోని బొబ్బిలిలో బుధవారం జరగనున్న టీడీపీ అధినేత సభను విజయవంతం చేయనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మంగళవారం శృంగవరపుకోట శ్రీగాయిత్రి మాత ఆలయం వెనక భాగంలో ఉన్న కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి ముఖ్యనేతలు, కార్యకర్తలు తరలివెళుతున్నామని, చీపురపల్లి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేలా చూసేందుకు తనను పార్టీ పరిశీలకునిగా నియమించిందన్నారు. విశాఖ పార్లమెంటు పార్టీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు గోరపల్లి రాము(కొత్తవలస), లగుడు రవికుమార్(జామి) నాయకులు గుమ్మడి భారతి, గోరపల్లి సుజాత, గొర్రిపాటి రమణ, పైడిబాబు, అడారి రమేష్ తదితరులున్నారు. ● **బొబ్బిలి:** స్థానిక రాజా కళాశాల మైదానంలో బుధవారం జరగనున్న టీడీపీ 'రా.. కదలిరా..' బహిరంగసభకు జిల్లావ్యాప్తంగా జనసేన కార్యక ర్తలంతా పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరు బాబు పిలుపునిచ్చారు. మంగళవారం సాయం త్రం తన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల జనసేన అధ్యక్షుడు సంచాన గంగాధర్, పళ్లెం రాజా తదితరులు పాల్గొన్నారు. ●**గజపతినగరం:** బొబ్బిలిలో తలపెట్టిన రా.. కదలిరా.. భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యా లయంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు హాజరు కానున్న ఈ సభకు నియోజకవర్గం నుంచి వేలాది మంది ప్రజలు తరలి వచ్చేలా సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు ఎ.లక్ష్మునాయుడు పాల్గొన్నారు. ● బొబ్బిలిలో చంద్రబాబు చేపట్టిన రా.. కదలిరా.. భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన పీఏసీ నాయకురాలు, మాజీ మంత్రి పడాల అరుణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అలాగే జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రాపు సురేష్ స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో బొబ్బిలి తరలి వెళ్లే విధంగా సన్నాహాలు చేపడుతున్నామని తెలిపారు. ● **గంట్యాడ:** బొబ్బిలిలో బుధవారం జరగనున్న రా.. కదలిరా.. సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు పిలుపునిచ్చారు. గంట్యాడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని సుమారు ఐదువేల మందికి తక్కువలేకుండా బయలుదేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లు విజయకుమార్, రంధి చినరాము నాయుడు, బూడి అప్పలనాయుడు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయనగరం దాసన్నపేట: బొబ్బిలిలో బుధవారం జరగనున్న 'రా కదలిరా' సభకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో జనసేన పార్టీ శ్రేణులు, ప్రజలు జయప్రదం చేయాలని విజయనగరంలోనిన ఆ పార్టీ నాయకుడు గురాన అయ్యలు పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ, జనసేన సంకీర్ణానికి పట్టం కట్టేందుకు జనం సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

రాజాం: ప్రతి వార్డు నుంచి 50 మందికి తక్కువ లేకుండా బుధవారం బొబ్బిలి సభకు తీసుకురావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ కోరారు. మంగళవారం రాజాంలోని పార్టీ కార్యాలయంలో మునిసిపాలిటీలోని వివిధ వార్డులు, నాలుగు మండలాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 20 వేలు మందిని సభకు తీసుకువస్తానని హామీఇచ్చానని అందుకు అందరూ సహకరించాలని కోరారు. పార్టీ నాయకులు గట్టి భాను, సుమల వెంకట మన్మథరావు, పిస్సింటి మోహన్‌రావు, కిమిడి అశోక్‌కుమార్, నంది సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్‌కుమార్, వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, టంకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీ.. యువకుడి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


భాస్కరరావు

రామభద్రపురం, జనవరి 9: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పెదపల్లివీధికి చెందిన పెదపల్లి భాస్కరరావు(27) స్కూటీపై గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాలూరు నుంచి విశాఖపట్టణం బుల్లెట్‌పై వెళ్తున్న నబ్బవరానికి చెందిన గ్రంతి లోకేష్ ఎదురెదురుగా రావడంతో బైపాస్ రోడ్డు వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భాస్కరరావుకు తీవ్రగాయాలు కావడంతో బాడంగి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. గండి లోకేష్‌కు గాయాలు కావడంతో రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతునికి 3 సంవత్సరాల కిందట వివాహమైంది. భార్య జ్యోత్స్నతోపాటు రెండు సంవత్సరాల కుమార్తె ఉంది. భాస్కరరావు భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ చిన్నయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి మహిళ మృతి

భోగాపురం, జనవరి 9: చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్‌ఐ టీఎస్ఎన్ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భోగాపురం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన ప్రాడంకి కొండమ్మ(53) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం వేకువజామున కాలకృత్యాలు నిమిత్తం స్థానిక సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న చెరువుకు వెళ్లింది. అక్కడ ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి వికలాంగుడైన భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దీనిపై మృతిరాలి భర్త కొండలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి డ్రైవర్ మృతి


వాసు

మెరకముడిదాం, జనవరి 9: ట్రాక్టర్ నడుపుతూ జారిపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ నవీన్ పడాల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాడంగి మండలం పాల్తేరు గ్రామానికి చెందిన చొక్కాపు వాసు(33) గ్రామంలో ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఉత్తరావల్లి-బాడంగి రహదారిలో ట్రాక్టర్‌తో వెళుతుండగా ఒక్కసారిగా తూలి కిందపడ్డాడు. ఘటనలో వాసు తలకు తీవ్ర గా యం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక నుంచి ఏదైనా వాహనం ఢీ కొట్టి గానీ, ట్రాక్టర్ ఇంజన్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడి గానీ ట్రాక్టర్ నుంచి తూలి కిందపడి ఉంటాడని భావిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. భార్య అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

బెలగాం: పార్వతీపురం మండలం అడారు గ్రామంలో సారా అమ్ముతున్నారన్న సమాచారంతో మంగళవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1700 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని, ఒకరిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర తెలిపారు. అడారు గ్రామానికి చెందిన మండంగి శ్రీరాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఎస్ఈబీ అధికారులు ఎస్‌ఐ రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామంలో ఒక వ్యక్తిని పట్టుకుని, రెండున్నర లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

చెరకు లారీల బోల్తా.. ట్రాఫిక్‌జాం


సంకిలి వద్ద ట్రాఫిక్ జాం దృశ్యం

రేగిడి: చిన్నయ్యపేట సెంటర్‌లో మంగళవారం స్థానిక షుగర్స్ కర్మాగారానికి వెళ్తున్న చెరకు లారీ బోల్తాపడింది. లారీ ఓ వైపునకు ఒరిగిపోయింది. ఓవర్‌లోడ్‌తో వస్తున్న లారీ సెంటర్‌వద్ద మలుపు తిప్పబోయి అదుపుతప్పింది. పాలకొండ- విశాఖ ప్రధాన రహదారిలో నిత్యం రద్దీగాఉండే చోటా బోల్తాపడడం, ఆ సమయంలో ఎవరు లేకపోవటం స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. ● **రేగిడి:** సంకిలి ఆర్‌సీఎంచర్చ ఎదుట మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఓవర్‌లోడ్‌తో వస్తున్న చెరకు ట్రాక్టర్ బోల్తా బోల్తాపడింది. దీంతో తొట్టెలో ఉన్న చెరకు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో పాలకొండ- రాజాం రహదారిమార్గం కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఫ్యాక్టరీకి సమీపంలో ఈఘటన చోటుచేసుకోవటంతో యాజమాన్య సిబ్బంది అప్రమత్తమై ట్రాఫిక్ క్లియర్‌చేశారు.

నాడు ఆదర్శం.. నేడు అధ్వానం



నాడు ఇలా చెత్తసంపద కేంద్రం, నేడు తొలగించిన ప్రదేశం

వంగర, జనవరి 9: అరసాడలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రం ఆదర్శంగా నిలిచింది. ఇటీవల కొందరు నాయకులు టీడీపీ నిర్మించిందనే ఉద్దేశంతో దానిని తొలగించడానికి ప్రణాళికలు తయారు చేశారు. ఆ స్థానంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని సిద్ధమయ్యారు. ఆ భవనాన్ని తొలగించడం అంత సులువు కాదని.. ఉన్నతాధికారుల అనుమతులు ఉండాలని మండల నాయకులు చెప్పినా ఆ నాయకులు వినలేదు. ఆ తరువాత కాంట్రాక్టరుతో సంప్రదించిన నాయకుడు పనులు ప్రారంభించాలని చెప్పాడు. ఇక్కడే సమస్య ప్రారంభమైంది. ప్రభుత్వ భవనం మంజూరుకు సంబంధిత గ్రామ పంచాయతీతో పాటు మరికొందరు అభ్యంతర పత్రం ఇవ్వాలి. ఆ తరువాత ప్రభుత్వం పరిశీలించి.. భవన మంజూరుకు అనుమతులు ఇస్తుంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నాయకులు గ్రామ సమీపంలో అభ్యంతరం పత్రం ఇచ్చారు. అక్కడ నిర్మాణాలు చేపట్టకూడదనే ఉద్దేశంతో ఆ నాయకుడు చెత్త సంపద కేంద్రాన్ని తొలగించేందుకు ప్లాన్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ నిర్మాణానికి ముందుకు రాలేదు. దీంతో ఉన్నది పోయింది... కొత్తది రాకుంది అన్న చందంగా మారింది. చెత్త సంపద కేంద్రం తొలగింపుపై పంచాయతీ అధికారి త్రినాథ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా... దీన్ని తొలగించే అధికారం తమకు గానీ.. నాయకులకు గానీ లేదన్నారు. తొలగించినట్లయితే సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చి వివరణ కోరుతామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

మెరుగైన వైద్యాన్ని అందించండి

బాడంగి: సీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మంగళవారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆసుపత్రి సలహా సంఘ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు మంచి వైద్యం అందించడంతోపాటు ఆహారాన్ని కూడా సక్రమంగా అందజేయాలన్నారు. డాక్టర్ కాశీవిశ్వనాథ్ ఆసుపత్రిలో 4 డాక్టర్ పోస్టులు, 5 హెడ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట జడ్పీటీసీ రామారావు, సలహాసంఘ సభ్యులు ఆవు సత్య నారాయణ, డాక్టర్లు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ

జామి: భీమసింగి గ్రామానికి చెందిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ రీజనల్ చైర్మన్, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వాకచర్ల భాస్కరరావు తన తల్లి జ్ఞాపకార్థం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో భాస్కరరావు మాట్లాడుతూ తన తల్లి ప్రకాశమ్మ వర్థంతిని పురస్కరించుకొని వీటిని అందించామని తెలిపారు. విన్నకోట సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సెలవులో ఎంపీడీవో

వంగర: స్థానిక ఎంపీడీవో హెచ్.శశిభూషణరావు దీర్ఘకాలిక సెలవులో వెళ్లినట్లు కార్యాలయ సూప రింటెండెంట్ త్రినాథ తెలిపారు. విధుల్లో చేరినప్పటి నుంచి ఇక్కడ తరచూ వివాదాలు జరుగుతున్న సమా చారం. దీంతోపాటు గతంలో కంచిలిలో పనిచేసిన సమ యంలో అక్కడ కొన్ని ఇబ్బందులు ఎదురై ఇక్కడకు బదిలీపై వచ్చినట్లు తెలుస్తోంది.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఆర్టీసీ డిపో నుంచి సంక్రాంతి పండగకు హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఎస్.కోట నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు ఈ నెల 10నుంచి 12వరకు అల్ట్రా డీలక్స్ బస్సులు వెళతాయన్నారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ బీహెచ్ఈఎల్ నుంచి ఈ నెల 11 నుంచి 13 వరకు సాయంత్రం 6.45కు ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. సాధారణ చార్జీలను మాత్రమే వసూలు చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోలులో అక్రమాలు

శృంగవరపుకోట: రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయకుండా.. ఆర్‌బీకేల సాయంతో దళారుల నుంచి ధాన్యం సేకరిస్తున్నట్టు వీరనారాయణంనకు చెందిన వైసీపీ నేత బోజంకి గోవింద ఆరోపించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ వేపాడ మండలం రామస్వామిపేట గ్రామ పరిధిలోని రైసు మిల్లుకు ధాన్యం పట్టుకెళ్లిన రైతులను తిరిగి పంపించేస్తున్నారన్నారు. మిల్లు యాజమాన్యం ధాన్యాన్ని తీసుకోకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని అధికారులు దళారులకు సహకరిస్తుండడంతో... రైతు పేరునే కొనుగోలు చేస్తున్నట్లు చూపిస్తున్నారన్నారు. దీంతో రైతులు ఒక్కో బస్తా వద్ద ఆరు కేజీలకు పైగా ధాన్యం నష్టపోవాల్సి వస్తోందన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి

రాజాం: రాజాం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేలా కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రరాజు(పీసీసీ) సూచించారు. మంగళవారం అమరావతిలో పార్టీ అధ్యక్షుడును పార్టీ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు, రాజాం నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కంబాల రాజవర్ధన్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నా రు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. షర్మిలను పీసీసీ అధ్యక్ష బాధ్యతలను అధిష్ఠానం అప్పగిస్తుందని, అందుకు అందరూ కష్టపడి పనిచేయాలని రుద్ర రాజు కోరారని రాజవర్ధన్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రేగిడి: ఉంగరాడమెట్ట సబ్‌స్టేషన్ నిర్వహణ ప నుల్లో భాగంగా బుధవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటలవరకు మండలంలో విద్యు త్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ హరి మంగ ళవారం తెలిపారు. బూరాడ, సంకిలి 11 కేవీ ఫీడర్‌లో ఉన్న 65 గ్రామాలు, రేగిడి ఫీడర్‌తో పాటు ఆర్ డ బ్ల్యుఎస్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

గ్రామాల పురోభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

విజయనగరం(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు వీలుగా సమగ్ర ప్రణాళికను రూపొందించాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో 2024-25 ప్రజా ప్రణాళిక రూపకల్పనకు సంబంధించి ఎంపీడీవోలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి గ్రామ, మండల స్థాయిల్లో పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయటం వాటి అమలు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినపుడే చక్కని ఫలితాలు వస్తాయన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాజ్‌కుమార్, రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీపీవో శ్రీధర్‌రాజా, ఎంపీడీవోలు, ఈఓపీఆర్డీలు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ జాతి అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● టీడీపీ పార్లమెంటు బ్రాహ్మణ సాధికారిత కమిటీ కన్వీనర్ రాకేష్ శర్మ


మాట్లాడుతున్న రాకేష్ శర్మ

విజయనగరం రూరల్, జనవరి 9: బ్రాహ్మణ జాతి అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పార్లమెంటు బ్రాహ్మణ సాధికారిత కమిటీ కన్వీనర్ ఇనుగంటి రాకేష్‌శర్మ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నాలుగేళ్ల పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ఒక్క పైసా ఇవ్వకుండా బ్రాహ్మణులను తీవ్రంగా మోసం చేశారన్నారు. బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి పాలకవర్గాన్ని నియమించకుండా నాలుగేళ్లు కాలయాపన చేశారన్నారు. రామతీర్థంలో రాముని విగ్రహం ధ్వంసమై నాలుగేళ్లయినా ఎటువంటి పురోగతి లేదన్నారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు వడ్లమాని శేఖర్, సుభద్ర, రవికుమార్, శ్రీనివాసరావు, వాసు, శంభునాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

శృంగవరపుకోట, జనవరి 9: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శృంగవరపుకోటలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులకు పోటీల గురించి వివరించారు. ఈ నెల 13న మండల స్థాయిలో ఎస్.కోట, వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, జామి మండల కేంద్రాల్లో ఈ ముగ్గులు పోటీలు జరుగుతాయన్నారు. 14న శృంగవరపుకోటలో నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 11 నుంచి శృంగవరపుకోట ప్రీమియమ్ లీగ్ (ఎస్.పీఎల్) క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు ఈనెల 14 వరకు జరుగుతాయన్నారు. క్రికెట్ పోటీల వివరాలకు అంబటి యశ్వంత్ 9000826574 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

హక్కులను కాలరాసిన ప్రభుత్వం

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు



మాట్లాడుతున్న హృదయరాజు

కలెక్టరేట్, జనవరి 9: ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉపాధ్యాయుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాలరాసిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఏపీటీఎఫ్ భవనంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీనం వల్ల ప్రాథమిక విద్యారంగం నాశనమైందన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను తగ్గించడంతో పేద విద్యార్థుల నాణ్యమైన విద్యకు గండి కొట్టారని ఆరోపించారు. ఉపాధ్యాయులను ప్రభుత్వ పథకాల అమలుకు వినియోగించడంతో వారి ఆత్మగౌరవం దెబ్బతిందన్నారు. చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ఈశ్వరరావు, సీహెచ్ వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు సదాశివరావు, సంఘ నాయకులు సత్యనారాయణ , సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ లారీలను ఆపేదెవరు?


బుగ్గిలోడుతో విశాఖ-అరకు ప్రధాన రహదారిపై వెళ్తున్న లారీ

శృంగవరపుకోట రూరల్, జనవరి 9 : మండలంలో ప్రతినిత్యం నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో లారీలు యథేచ్ఛగా తిరుగుతున్నా.. అడ్డుకట్ట వేసేవారు కనిపించడం లేదు. విశాఖపట్నం నుంచి లారీలు హైవే పనుల కోసం నిత్యం బుగ్గిని తెస్తున్నాయి. నిబంధ నల ప్రకారం 30 నుంచి 35 టన్నుల వరకు తేవాల్సి ఉండ గా... రాత్రి వేళ.. వేకువజాము సమయాల్లో 55 టన్నులకు పైబడి తెస్తున్నారు. ఇది లారీల యజమానులకు కాసులు కురిపిస్తుంటే... రోడ్లు మాత్రం దెబ్బ తింటున్నాయి. ఈ మధ్య కాలంలో విశాఖ-అరుకు రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. క్వారీలు, క్రషర్ల నుంచి పిక్కను కూడా నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో తీసుకెళుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖలు చూసీ చూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ తరహా లారీల యజమానులు అధికారులకు నెలవారీ మామూళ్లు సమర్పించుకోవడంతో వీరిని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలు అతిక్రమించి తిరుగుతున్న లారీల విషయంలో ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

50 శాతం డిపోలకే కందిపప్పు

● సంక్రాంతి సమయంలో కోత విధించడంపై లబ్ధిదారుల నిరాశ


సంకిలిలో కందిపప్పు లేకుండా రేషన్ ఇస్తున్న ఎండీఎం ఆపరేటర్

రేగిడి: జిల్లాలో రేషన్‌డిపోల ద్వారా ఈనెలలో కందిపప్పు కోత విధించారు. ప్రస్తుతం కందిపప్పు 50శాతమే డిపోలకు చేరింది. రేగిడి, వంగర మండలాల్లో 114 రేషన్‌డిపోలకు సం బంధించి సివిల్‌సప్లయిస్ గొడౌన్ రేగిడిలో ఉంది. లెక్క ప్రకారం రేగిడి మండలంలోని 66 డిపోలకు వందశాతం ప్రాప్తికి 21,199 కేజీలు, వంగరలోని 54 డిపోలకు వంద శాతం ప్రాప్తికి 12,569 ప్యాకెట్లు సరఫరా కావల్సిఉంది. అయితే ఈనెల 50శాతం కోత విధించడంతో రేగిడికి 10,600 (కేజీప్యాకెట్లు), వంగరకు 6,265(కేజీప్యాకెట్లు) సరఫరా అయ్యాయి. ఈ లెక్కన రేషన్‌డిపోలకు చేరగా వీటిని ఎం డీఎం ఆపరేటర్లు పంపిణీకి అవస్థలుపడుతున్నారు. ఈనేప థ్యంలో కొన్నిగ్రామాలకు పూర్తిగా పంపిణీ నిలిపివేసినట్లు సమాచారం. సంకిలి, అప్పాపురం, ఉంగరాడ రేషన్‌డిపోల్లో కందిపప్పు ఇవ్వకపోవడంతో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదువెళ్లడంతో ఉంగరాడలో 50శాతం మందికి పంపిణీచేశారు. పండగపూట కందిపప్పు కోత విధించడంపై రేషన్‌లబ్ధిదారులు నిరాశ చెందుతు న్నా రు. డిపోల్లో కందిపప్పు నిండుకోవడంతో స్టాక్‌వచ్చిన కందిపప్పును ఎండీఎం ఆపరేటర్ అర కేజీ చెప్పున సర్దుబాటు చేస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలో కొన్నిగ్రామాల్లో లబ్ధిదారులు నిలదీస్తున్నారు. ఉంగరాడలో చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకోగా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. కాగా ఈనెల కందిపప్పు సరఫరా 50శాతం రాగా ఈమేరకు రేషన్‌డిపోలకు సర్దుబాటుచేసినట్లు రేగిడి, వంగర సివిల్‌సప్లయ్‌గొడౌన్ ఇన్‌చార్జి బి.గోవింద రావు తెలిపారు. ఇంకా 150 కేజీల స్టాక్ ఉందని, అవసరమైనవారికి సర ఫరా చేశామని చెప్పారు. 85 శాతం డిపోలకు ఈనెల 50శాతం సరఫరా చేయ గా, స్టాక్‌లేక కొన్నిడిపోలకు ఇవ్వలేకపోయామని తెలిపారు.

స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు

● ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు


మాట్లాడుతున్న రఘు రాజు

శృంగవరపుకోట, జనవరి 9: ఈసారి శృంగవరపుకోట ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు స్థానికులకు అవకాశం కల్పించాలని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు వైసీపీ అధిష్ఠానం వద్ద డిమాండ్ చేస్తున్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు స్థానికేతరుడైనప్పటికీ అందరం కలిసికట్టుగా పని చేసి గెలిపించామన్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు గౌరవం ఇవ్వకపోవడంతో పాటు ప్రోటోకాల్ పాటించకపోవడంతో ఇపుడు స్థానిక నినాదం చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను బట్టి అభ్యర్థి మార్పు ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కొజొన్న సాగు

బొబ్బిలి, జనవరి 9: మెట్టవలస గ్రామంలో మంగళవారం జీరో టిల్లేజ్ విధానంలో మొక్కజొన్న పంట సాగు కోసం విత్తనాలు వేశారు. చోడవరపు సూర్యనారాయణకు చెందిన ఆరు ఎకరాలలో పంట సాగు చేశారు. జీరో టిల్లేజ్ పద్ధతిలో దుక్కి దున్నకుండా విత్తనాలు వేశారు. వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో సిబ్బంది రైతులకు సూచనలిచ్చారు. ఈ విధానంలో ఎకరాకు రూ.ఐదు వేల నుంచి రూ.ఏడు వేల వరకు ఖర్చు అవుతుందని... పంట దిగుబడి పెరుగుతుందని ఏడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు మన బాధ్యత

లక్కవరపుకోట: ప్రతీ ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్.కోట నియోజకవర్గ ఎన్నికల అధికారి సుదర్శనదొర తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో మహామాయా కర్మాగార ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఓటుహక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. బారత రాజ్యాంగం ప్రవేశపట్టిన ఓటుహక్కును అందరూ బాధ్యతతో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క ంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ మురళీవర్మ, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో పతకాలు

కొత్తవలస: జాతీయ స్థాయిలో నిర్వహించిన స్కైవే మార్షల్ ఆర్ట్స్ పోటీలలో కొత్తవలసకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించినట్టు స్కైవే మార్షల్ ఆర్ట్స్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు తెలిపారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజస్థాన్‌లో పోటీలు జరిగాయని తెలిపారు. కొత్తవలస మండలం నుంచి 11 మంది హాజరు కాగా వీరిలో ముగ్గురికి బంగారు పతకాలు, నలుగురికి వెండి, ఏడుగురికి కాంస్య పతకాలు వచ్చాయన్నారు.

ఏపీసీపీఎస్ఈఏ కార్యవర్గం ఎన్నిక

తెర్లాం: మండల కేంద్రంలో పనిచేస్తున్న అన్ని డిపార్ట్‌మెంట్‌ల సీపీఎస్ ఉద్యోగులు హాజరై జిల్లాప్రధాన కార్యదర్శి ఎం.శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం ఏర్పరిచి ఏపీసీపీఎస్ఈఏ మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా సాకేటి గణపతి, సలహాదారుగా గేదెల శంకరరావు, అధ్యక్షునిగా బూరి తవిటినాయుడు, ప్రధాన కార్యదర్శిగా బత్తిన సురేష్ తదివతరులను ఎన్నుకున్నారు.

పోరాటం ఉధృతం చేస్తాం

● కొనసాగిన మునిసిపల్ కార్మికుల నిరసన


రాజాంలో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు


బొబ్బిలి: నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజాం రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు తెలిపారు. మంగళవారం ము నిసిపల్ కార్మికుల సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి, అధికారం లోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతున్న సమయంలో ఆర్థికపరమైన అంశాలు ఇప్పుడు అమలు చేయలేమని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేర్కొనడం విడ్డూ రంగా ఉందన్నారు. ● **బొబ్బిలి:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల దీక్షలు మంగళవారం కొనసాగాయి. పంగనామాలు పెట్టుకుని నిరసన తెలుపుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రైతులకు శఠగోపం పెట్టిన ప్రభుత్వం

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు



మాట్లాడుతున్న కళావెంకటరావు

సాలూరు: వైసీపీ ప్రభుత్వం రైతులపై శఠగోపం పెట్టిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు విమర్శించారు. మంగళవారం సాలూరులోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి నివాసంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం పది గంటలకు బొబ్బిలి ప్రాంగణంలో నిర్వహించనున్న రా.. కదలిరా కార్యక్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొని, ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో అనేక ఇంజినీరింగ్ కాలేజీలు మూత పడ్డాయని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేకపోయారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి, పట్టణ నాయకులు నిమ్మాది తిరుపతిరావుతో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ లక్ష్మోజీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలోకి జగదీష్



ఒకే ద్విచక్ర వాహనంపై కార్యాలయానికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలో టీడీపీ కార్యాలయం ప్రారంభం అనంతరం మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర మధ్య కొంతదూరం ఏర్పడిందని గుసగుసలు వినిపించాయి. అయితే వీటికి చెక్‌పెట్టే విధంగా జగదీష్ తన అనుచరులతో కలిసి మంగళవారం ర్యాలీగా వెళ్లి, టీడీపీ కార్యాలయంలో అడుగుపెట్టారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు కూడా సోమవారం కార్యాలయంలోకి వెళ్లారు. విజయచంద్ర.. జగదీష్ ఇంటికి వెళ్లి ఆహ్వానించారు. సంభాషణ అనంతరం అక్కడ నుంచి జగదీష్, విజయచంద్ర ఒకే బైకుపై తన అనుచరులతో కలిసి వివిధ వాహనాలపై ర్యాలీగా టీడీపీ కార్యాలయానికి వచ్చారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు గోవిందరాజులు పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

● టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి జయకృష్ణ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నిమ్మక జయకృష్ణ

పాలకొండ: వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆరోపిం చారు. మంగళవారం మండలంలోని పెద్దకోటిపల్లి, చిన్నకోటిపల్లి, గుడివాడల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే రా ష్ట్రం బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. యువత మద్దతు టీడీపీకే ఉందన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ప్రజలు గద్దెదింపుతారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీరాజ్ వ్యవసను ప్రక్షాళన చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు గండి రామినాయుడు, సర్పంచ్ శేషపు సుగుణాకర్, నాయకులు కిమిడి కాశింనాయుడు, జాడ శ్రీధర్, బొంగు చంద్రశేఖర్ అల్లు గోవింద, బొప్పాడ దొర, మోహన్, కరణం వరహాల నాయుడు, మంకు భాస్కర్‌రావు, కోట సంగంనాయుడు, రణస్థలం ప్రభాకరరావు, గొర్లె రాంబాబు, వాకమూడి వెంకటేష్, మంకు రాము, బిడ్డిక రవి, కూరంగి రామారావు, కూరంగి రాజు, పత్తిక రమేష్, కూరంగి ప్రభావతి, ఊలక నూకయ్య పాల్గొన్నారు.

ముగిసిన పౌర సంస్థ క్రీడా పోటీలు



వేదికపై ముదిలి, మహేష్ తదితరులు

రాయగడ: పురపాలకసంస్థ ఆధ్వర్యంలో పట్టణపరిధిలో పురాధ్యక్షుడు మహేష్ పట్నాయక్ అధ్యక్షతన నాలుగు రోజులుగా జరుగుతున్న వివిధ క్రీడాకారులకు నిర్వహించిన వివిధ రకాల క్రీడాపోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మకరంద ముదిలి విజేతలకు ఆర్థికమొత్తాలతో పాటు ట్రోఫీలను అందజేశారు. ముగింపు కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు శుభ్రపండా, కౌన్సిలర్లు లీనాపండా, శర్మిష్టి పాడి, బార్తి జగన్మోహన్‌రావు, జిల్లా బిజూజనతాదళ్ యువజన అధ్యక్షుడు అవినాశ్ బిసోయ్, పాల్గొన్నారు.

ఉపాధి కల్పనా మేళా

రాయగడ: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో మంగళవారం ప్రధానమంత్రి అంప్రెటిషిప్ మేళా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆరు వివిధ సంస్థలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొని, వివిధ ట్రేడ్లకు చెందిన 89 మంది విద్యార్థులను పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నరేంద్రకుమార్ నాయక్, విజయ్‌కుమార్ సాహు, ఎన్.కోటిరత్నం తదితరులు పాల్గొన్నారు. ఇనిస్టిట్యూట్ చైర్మన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



ధర్నాలో పాల్గొన్న శ్రామికులు

రాయగడ: ఓపీఎస్ పునరుద్ధరించాలని తూర్పుకోస్తా రైల్వే శ్రామిక సంఘం మంగళవారం డివిజనల్ సహాయక ఇంజినీర్ (ఏడీఈఎన్) కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈసందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి, డివిజనల్ ఉప సమన్వ యకుడు అశోక్‌కుమార్‌పాడి మాట్లాడారు. బొబ్బిలి, రాయగడ రైల్వేశ్రామిక సం ఘం శాఖలు కూడా ధర్నాలో పాల్గొన్నాయి. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏడీఈఎన్ సంజీవ్‌దీక్షిత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాయగడ శాఖ కార్యదరిశ బి.మురళీధర్ రెడ్డి, బొబ్బిలి శాఖ ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

'రా.. కదలిరా'కు తరలిరావాలి

● తెలుగుదేశం నాయకులు
● ఏర్పాట్లు పూర్తి

బొబ్బిలిలో బుధవారం నిర్వహించే రా కదలిరా కార్య క్రమం విజయవంతంచేయడానికి కార్యకర్తలు తరలిరావాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చా రు.ఈ మేరకు మంగళవారం జిల్లాలోని పలుచోట్ల రా కదలిరా కార్యక్రమం నిర్వహణపై చర్చించారు.



సీతానగరం: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



గరుగుబిల్లి: మాట్లాడుతున్న పీవీజీ కుమార్

● పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: విజయనగరం జిల్లా బొబ్బిలిలో బుధవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్వహించనున్న రా.. కదలిరా.. కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్వతీపురం, సాలూరు, కొరపాం, పాలకొండ నియో జకవర్గాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలించేందుకు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు రెండు లక్షల 50 వేల మంది ఈ సభకు హాజరవుతున్నారని పార్టీ నాయకుల అంచనా.

● పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: బొబ్బిలిలో నిర్వ హించనున్న రా.. కదలిరా.. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హా జరుకావాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజ యచంద్ర కోరారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క చక్కెర కర్మాగారాన్ని మూసివేశారని, సీతానగరం వద్ద ఉన్న వంతెనను పూర్తి చేయలేకపోయారని, జంఝావతి రిజర్వాయర్ హైలెవెల్ కెనాల్ పనులు చేపట్టలేదని విమర్శించారు.

సాలూరు: బొబ్బిలిలో బుధవారం జరగనున్న రా.. కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ పరిశీలకుడు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు కోరారు. మంగళవారం సాలూరులోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి నివాసంలో ఆయన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బొబ్బిలిలో సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాలూరు జనరల్ పరిశీలకుడు విశ్వప్రసాద్, ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పిన్నింటి ప్రసాద్‌బాబు, వేణు, పరమేశ్ పాల్గొన్నారు.

● గరుగుబిల్లి: బొబ్బిలిలో బుధవారం నిర్వహిం చనున్న చంద్రబాబు సభను జయప్రదం చేయాలని కురుపాం నియోజకవర్గ పరిశీలకుడు పీవీజీ కుమార్ కోరారు. ఉల్లిభద్రలో విలేకర్లతో మాట్లాడారు. సమావే శంలో టీడీపీ మండలాధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మరడాన తవిటినాయుడు, నారాయణస్వామి పాల్గొన్నారు.

● సీతానగరం: బలిజిపేటలో బొబ్బిలిలో బుధవారం జరగనున్న రా కదలిరా కార్యక్రమం విజయవంతం చేసేందుకు పార్టీ మండలాధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బి.విజయ్‌చంద్ర, పరిశీలకులు ముళ్ల సురేంద్ర, గోవిందరాజులు, చోడవరం ఇన్‌చార్జి తాతయ్య బాబు, విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజ య్‌చంద్ర మాట్లాడుతూమండలం నుంచి భారీ ఎత్తున తెలుగుదేశం అభిమానులు, కార్యకర్తలు తరలిరవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెంకి పార్వతమ్మ, రామో హన్, బలిజిపేట మండల నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే జాతర విజయవంతం

● రెవెన్యూ డివిజనల్ అధికారి హేమలత

మక్కువ:అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పోలమాంబ జాతర విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఆర్డీవో కె.హేమలత అధికారులను ఆదేశించారు. శంబర గ్రామంలో వివిధ శాఖల అధికారులతో జాతర నిర్వహణ, ఏర్పాట్లపై మంగళవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, శంబర చేరుకునే రోడ్లకు మరమ్మతుల పనులను వేగవంతం చేయాలన్నారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను కోరారు. సమీక్ష సమావేశానికి విద్యుత్తు శాఖ అధికారులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లను పెంచాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని దేవదాయ సిబ్బందిని ఆదేశించారు. శాఖల వారీగా చేస్తున్న ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాలూరు, పార్వతీపురం డిపోల నుంచి బస్సుల సంఖ్యను పెంచాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యశిబిరాలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకురాగా.. పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సునీల్ సోరెన్, జిల్లా దేవాదాయశాఖాధికారి డీవీవీ ప్రసాద్, ఈవో వీవీ సూర్యనారాయణ, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, గ్రామ పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలమాంబ జాతరకు పటిష్ఠ బందోబస్తు



క్యూలైన్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ సునీల్ సోరెన్

పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి పటిష్ఠ బందోబస్తుచర్యలు చేపట్టాలని ఏఎస్పీ సునీల్ సోరెన్ పోలీసు అధికా రులను ఆదేశించారు. మంగళవా రం ఆయన జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఎంతమంది భక్తులు వస్తారు? ఎన్ని క్యూలైన్లు ఏర్పాటు చేస్తారు? పోలీసు బందోబస్తుకు సంబంధించి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలమాంబను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సాలూరు రూరల్ సీఐ ధనుంజయరావు, ఎస్ఐ నరసింహమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలమాంబ ఘటాలకు పూజలు



అమ్మవారి ఘటాలకు పూజలు చేస్తున్న మహిళలు

మక్కువ: చదురుగుడిలోకొలువై ఉన్న శంబర పోలమాంబ అమ్మవారి ఘటాలకు మహిళలు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలను మంగళవారం నిర్వహించారు. చదురుగుడికి చేరుకున్న ఘటాలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పసుపు, కుంకుమ, చీరలు చూపించి మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామంలో జాతర వాతావరణం మొదలైంది. సమయం దగ్గర పడుతుండడంతో అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

● జియ్యమ్మవలసలో ఎంపీపీ ధర్నా



ధర్నా చేస్తున్న ఎంపీపీ సురేష్, గిరిజనులు

జియ్యమ్మవలస: గిరిజన ప్రాంతాల్లో రహదారి సౌకర్యం కల్పించాలంటూ మంగళవారం మండల కేంద్రంలో గిరిజనులు ధర్నా చేపట్టారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాలో ఎంపీపీ బొంగు సురేష్ పాల్గొన్నారు. ముందుగా బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత పదేళ్లుగా కురుపాం ఎమ్మెల్యేగా, మూడేళ్ల రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా ఉన్న పుష్పశ్రీవాణి సొంత మండలమైన జియ్యమ్మవలసలో రోడ్ల విషయాన్ని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తనకు అనుకూలంగా ఉన్న వారి ప్రాంతాల్లో, ఓటు బ్యాంకు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే నిధులు ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. 'కేవలం మీకు అనుకువగా ఉన్నవారు చెప్పిన గ్రామాల్లో మాత్రమే రోడ్లు వేయించి, బిల్లులు డ్రా చేసుకున్నారని, దీనికి మీ మరిది రమేష్‌బాబును ఆయుధంగా ఉపయోగించారని ఆయన ఆరోపించారు. అనంతరం ఎంపీడీవో పి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.సీతారాం, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

తుగ్లక్ పాలనకు చరమగీతం పలకాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

గరుగుబిల్లి: రాష్ట్రంలోని తుగ్లక్ పాలనకు ప్రజలు చరమ గీతం పాడాలని టీడీపీ అరకు బీసీ సెల్ అధికార ప్రతినిధి డి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం శివ్వాం గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. బొబ్బిలిలో జరగనున్న టీడీపీ సభను జయప్రదం చేయాలని కోరారు. టీడీపీ ప్రతినిధులు నారాయణస్వామి, బలరాంనాయుడు, మోహనరావు, చంద్రరావు, సింహాచలంనాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

వైభవంగా పొన్నాకుల హారతి



రామాలయంలో పొన్నాకుల హారతి ఇస్తున్న మహిళలు

సాలూరు రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు సందర్భంగా మంగళవారం స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి, పెదకోమటిపేట రామాలయంలో లక్ష్మీదేవి, భూదేవి సమేత నాథన్‌కు పొన్నాకుల హారతి వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

గరుగుబిల్లి: ప్రకృతి విధానంలో పండించే పంటల్లో అధిక దిగుబడులు సాధ్యమవుతున్నాయని ప్రకృతి సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. మంగళవారం తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం డివిజన్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు ప్రకృతి పద్ధతులే శరణ్యమన్నారు. రైతులను చైతన్యపర్చి అధిక దిగుబడులు వచ్చేలా కృషి చేసిన ముగ్గురు రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, వెలుగు సీసీ కృష్ణ, మండల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పీవీటీజీలకు పథకాలు అందాలి: ఏవో

సాలూరు రూరల్: పీవీటీజీ గిరిజనులకు ప్రభుత్వ పథకాలన్ని అందేటట్టు గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రద్ధ తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనురాధ పండా అన్నారు. ఆమె మంగళవారం సాలూరులోని తన కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మండలంలో 2,600 మంది పీవీటీజీ గిరిజన రైతులు ఉన్నారని చెప్పారు. వారందరికి పీఎం కిసాన్ యోజన, రైతు భరోసా తదితర పథకాలు అందేటట్టు రిజిస్ట్రేషన్ కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. మండలంలో 6వేల మంది ఆర్‌వోఎఫ్ఆర్ రైతులకు పథకాలందే విధంగా చొరవ చూపాలన్నారు. సకాలంలో ఈ క్రాపింగ్ చేయాలన్నారు. సమావేశంలో శ్రీనివాసరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మక్కువలో శాశ్వత రహదారి నిర్మించండి

మక్కువ: మక్కువలో కనీసం రోడ్డయినా నిర్మించడం మహాప్రభో అని టీడీపీ మండల నాయకుడు మావుడి ప్రసాదరావు కోరారు. మక్కువలో జరుగుతున్న రోడ్డు మరమ్మతులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. కనీసం ప్రధాన రహదారిలోనైనా తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. రోడ్డు మరమ్మతులు చేపడితే అనవసరంగా కాలువలు ఎందుకు తవ్వుతున్నారని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయని, వీధి లైట్లు వెలగడం లేదని, ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు ఎప్పటికి మారుతాయోనని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్క్ సుందరీకరణ పూర్తి చేయాలి

● పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: ఎస్‌కేపాడు పార్క్ సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ ఆదేశించారు. గుమ్మలక్ష్మీపురం, కురపాం మండలాల్లో ఆయుష్మన్‌భారత్ ప్రక్రియను, ఎస్‌కేపాడు ఉద్యాన నర్సరీలో చేపడుతున్న పర్యాటక సుందరీకరణ పనులను మంగళవారం పరిశీలించారు. పర్యాటక నిలయంగా ఈ ప్రాంతం మారాలని, ఇక్కడ ప్రకృతి రమణీయత, వాగులు, జలపాతాలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయన్నారు. కాగా ఆయుష్మాన్ భారత్ కార్య క్రమం కింద పీవీటీజీలను నమోదు చేయాలని, ఈ-కేవైసీ చేయాలని పీవో ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో పీవీటీజీలను నమోదు, ఈ-కేవైసీల పరిస్థితిని గుమ్మలక్ష్మీపురం మండలం కేఎస్‌కేపాడు, కురుపాం మండలం చాపరాయిగూడ గ్రామాల్లో తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ,పంచాయతీ సె క్రటరీ, సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో సోషల్ ఆడిట్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 2022-233 సంవత్సరంలో 27 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామీణ ఉపాధి హామీ పనులపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 17వ సోషల్ ఆడిట్ ప్రజావేదికను నిర్వహించారు 27 పంచాయతీల్లో గత ఏడాది జరిగిన రూ.18 కోట్లతో చేపట్టిన మూడువేల పనులపై సోషల్ ఆడిట్ జరిగింది. గ్రామాల్లో ఎస్సీ ఆర్పీలు ప్రజల నుంచి సేకరించిన నివేదిక వివరాలపై చర్చించారు.ఈ కార్య క్రమంలో డ్వామా పీడీ రామచంద్రరావు, ఏపీడీ చంద్రరావు, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, ఉపాధి హామీ ఏపీవో శివరామకృష్ణ పాల్గొన్నారు.

గుమ్మలో ఆరోగ్య సురక్ష

కురుపాం రూరల్: గుమ్మ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.ప్రజ్ఞ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 495 మంది గిరిజన రోగులకు వైద్యం అందించారు. మందులు పంపిణీ చేశారు. డీఎంహెచ్‌వో బి.జగన్నాధరావు శిబిరాన్ని పరిశీలించారు.

జానుమల్లవలసలో జేఏఎస్

సీతానగరం: జానుమల్లవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్ 2) కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రభుతేజ, ఈవోపీఆర్డీ కేకే కుమార్‌వర్మ, సర్పంచ్ వై.వెంకటనాయుడు, స్పెషలిస్టు వైద్యులు స్వరూప్, పవన్, పంచాయతీ సెక్రటరీ టి.అశోక్ పాల్గొన్నారు.

సరుకులు అందుబాటులో ఉంచాలి: జేసీ



అంపావల్లి బియ్యం పంపిణీ పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు

సీతానగరం: ఎండీయూ నిర్వాహకులు లబ్ధిదారులకు సరుకులు అం దుబాటులో ఉంచాలని జాయింట్ కలెక్టర్ గోవిందరావు కోరారు. మంగళ వారం మండలంలోని అంపావల్లి, పెదపెంకిల్లో ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అందుతున్న బియ్యం, పంచదార, దాల్, గోధుమపిండి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె .అప్పలరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బెదిరింపు చర్యలు ఆపాలి

● ఎస్మాకు భయపడేది లేదు
● 29వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

ప్రభుత్వం బెదిరింపు చర్యలను ఆపాలని అంగన్‌వాడీలు స్పష్టంచేశారు. ఎస్మాకు భయపడేదిలేదని తేల్చిచెప్పారు. మంగళవారం 29వ రోజు వినూత్నంగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా రిలే దీక్షలు చేయడంతోపాటు అంబేడ్కర్ విగ్రహాలకు కార్యకర్తలు వినతిపత్రాలు అందజేయడంతోపాటు ఎస్మా పత్రులను దహనంచేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పార్లుదండాలతో వినూత్నంగా నిరసన తెలిపారు.

-ఆంధ్రజ్యోతి బృందం





భామిని, పాలకొండలో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు